
# ఎంత ఆలోచించినా

విజయ సర్వలక్ష్మి



స్త్రీ పురుషులు సమానం అంటూ వ్యాసాలు రాసీ ప్రయోజనం లేదు. ప్రసంగాలిచ్చి ఉపయోగం లేదు. ఒక స్త్రీ అత్యాచారానికి గురయినప్పుడు అంటే ఒక బలహీనతకో, దౌర్జన్యానికో బలయినప్పుడు ఆ స్త్రీ పట్ల సంఘం దయార్ద్ర హృదయంతో, నిజాయితీతో, నిగ్రహంతో వ్యవహరించవలసి వుంటుంది. అలాంటప్పుడే ఆ స్త్రీ ఆత్మ ధైర్యంతో జీవించ గలుగుతుంది.

మనవరాలు, మనవడు ఎలా వున్నారోనని, కొత్త కాపురం ఎలా వుందోనని చూడడానికి దూరాభారాలు లెక్క చెయ్యకుండా కాకినాడ నుంచి హైద్రాబాద్ వచ్చింది పాపం రాధమ్మ.

మనవరాలు పేరు రాధారాణి. కొడుకు బిడ్డ. మనవడి పేరు రాధాకృష్ణ, కూతురు బిడ్డ. రాధమ్మ కొడుకూ, కూతురు తల్లి మీద అభిమానంతో తమ పిల్లలకు తల్లి పేరు పెట్టుకున్నారు. రాధారాణికి మేనరికం చేశారు. ఇద్దరూ ఇష్టపడి చేసుకున్న పెళ్లే కాని పెద్దలు బలవంతంగా చేసినది కాదు.

రాధమ్మ వచ్చినప్పటినుంచీ ఇద్దరు సరదాగానే వున్నారు. నాలుగు రోజుల నాడు స్నేహితురాలింట్లో డిన్నరు పార్టీ అని వెళ్లిన రాధారాణికి వున్నట్లుండి ఆరోగ్యం పాడై పోయింది. జబ్బేమిటో చెప్పదు. ఎవరితోను మాట్లాడదు. ఏదడిగినా కిమ్మనదు. పిచ్చిదానిలా పడుకొని ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తుంది.

మొగుడు రాధాకృష్ణ ఎన్నిసార్లు బ్రతిమాలాడో లేచి అన్నం తినమనీ, డాక్టరును చూడమనీను, ఊహూ ససేమిరా కదలలేదు. బామ్మగారు రాధమ్మ సరేసరి. ఆవిడ బ్రతిమాలడానికి అంతే లేదు. చూస్తుండగా నాలుగు రోజులు గడిచాయి. రాధారాణి పనిచేసే ఆఫీసు నుంచి ఆమె కొలీగు, రాధ ఎందుకు రావడం లేదోనని పలకరించడానికి వచ్చేడు కూడా. 'ఇప్పుడే నిద్రపోయిందని చెప్పు బామ్మ' అంటూ అతనితో కూడా మాట్లాడ లేదు రాధ. ఆఖరుకు రాధాకృష్ణకు విసుగెత్తి రాధకు వంట్లో బాగాలేదని ఫోన్ చేసేశాడు. రాధ ఎందుకలా ప్రవర్తిస్తుందో అర్థం అవక, ఆమెనేం చెయ్యలేక, ఏం చెయ్యాలో తోచక అలా హైద్రాబాద్, సికింద్రాబాద్‌లు సర్వే చేయడం మొదలు పెట్టాడు.

ఆ వేళ శుక్రవారం. రాధకు ప్రతీ శుక్రవారం లక్ష్మి పూజ చేసుకోవడం అలవాటు. ముండికేసుకుని పడుకున్న మనవరాలి దగ్గరకు వెళ్లి 'అమ్మడూ రాధమ్మా! ఈ వేళ శుక్రవారం రా! ఈ వేళైనా లేచి స్నానం చేసి పూజ చేసుకో తల్లీ! మనశ్శాంతిగా వుంటుంది' అని బతిమాలింది.

''హు మనశ్శాంతి'' అంది బేలగా. 'అదేమిటే అలా అంటావ్? నీకేం తక్కువే? నువ్విలా భీష్మించుకు కూర్చుంటే వాడికి మతిపోయి వీధులు పట్టుకు తిరుగుతున్నాడు తెలుసా? లే అమ్మా! నీళ్లు కాగాయి. హాయిగా తలంటుకో, లే. మా అమ్మవు కాదూ?' అంది రాధమ్మ.

'లేదు బామ్మ! నువ్వు కాకపోతే ఎవరున్నారిక్కడ గాని, నాకు చాలా పెద్ద సమస్య వచ్చి పడింది. నేను మొన్న కాంపుకెళ్లి వచ్చాను గుర్తుందా?' అంది రాధ.

'అవును. అప్పటి నుంచే కదా నువ్విలా మూగ నోము పట్టింది?'


'అప్పుడే ఒక ఘోరం జరిగిపోయింది బామ్మా'

'ఏమిటే? ఉండు, ఎవరైనా వున్నారేమో చూసి తలుపులు గట్టిగా వేసి వస్తాను' అంటూ ఇవతలకు వచ్చింది. అంతవరకూ ఇవతలే నిలబడి వున్న రాధాకృష్ణ వెంగున లోపలికి దూకి బట్టల స్టాండు చాటుకు వెళ్లి పోయాడు. ఆ ఘోరం ఏమిటో వినాలని.

నాలుగు పక్కలా చూసింది రాధమ్మ. ఎక్కడా ఎవరూ కనిపించలేదు. స్నానాల గదిలో బట్టలుతుకు తోంది పని మనిషి. గది లోపలికి వచ్చి తలుపులు గట్టిగా గెడవేసి మనవరాలి దగ్గరగ కూర్చుంది రాధమ్మ.

'నా తల్లే! అప్పుడే అనుకున్నాను, ఏదో బాధపడు తున్నావని. నేనెవరితోను చెప్పను సరికదా ఉపాయ మేదైనా చెప్తాను. చెప్పు తల్లీ' అంటూ బుజ్జగించింది మనవరాల్ని.

'వరంగల్లులో మా ఆఫీసుకు చేరేసరికి సాయంత్రం అయిదయింది. నాకూ, మా డైరెక్టరుకీ, మావాళ్లందరికీ బస ఏర్పాటు చేసిన బంగళా చాలా బావుంది. స్నానాలూ, భోజనాలు అయ్యాక వరండాలో కొంచెంసేపు అవీ ఇవీ మాట్లాడుకొని ఎవరి రూముల్లో వాళ్ళు విశ్రాంతి తీసుకొంటున్నాం. ప్రయాణంతో అలసిపోయి వున్నా నేమో వెంటనే నిద్ర పట్టేసింది. అర్ధరాత్రి రెండవు తుందనుకుంటాను, ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు వినిపించింది. ఎవరై వుంటారని కిటికీ దగ్గరకు వెళ్లి




చూశాను. మా డైరెక్టరే! 'రాధాగారూ' అంటు పిలుస్తు న్నాడు'

'అమ్మా! ఎన్నాళ్ల నుంచి ఉందో ఏమో?' అంది రాధమ్మ నిష్ఠూరంగా.

'ఏమో! ఎలా తెలుస్తుంది? అంతా సంస్కారంతో చాలా జాగ్రత్తగా వుంటారు బామ్మ. ఎక్కడ పసిగట్ట గలం? 'ఏమిటండీ' అన్నాను. 'ఏం లేదు. నాకేమిటో నిద్ర రావడం లేదు. ఒంట్లో కులాసా లేదు. కాస్సేపు ఇక్కడ కూర్చుని వెడదామని' అన్నాడు. నాకేదో కొత్తగా, చిత్రంగా వినిపించింది. 'ఇంత రాత్రి వేళ...' అంటూ నసిగాను. 'ఛ ఛ అదేమిటి అలా అంటారు. మనలో మనకి కూడా అలాంటి భావాలా? అయితే వెళ్లిపోతాను లెండి!' అంటూ వెనక్కి వెళ్లిపోబోయాడు. నాకే సిగ్గనిపించింది. 'ఇంత ఉద్యోగం ఇన్నాళ్ళ నుంచీ చేస్తూ ఇలా అసహ్యంగా ప్రవర్తించుతున్నాను ఏమిటా?' అని. గమ్మున తలుపు తీశాను. 'రండి' అని లైటు వేశాను. వచ్చి కూర్చున్నాడు. అవీ ఇవీ ఏవో మాటలయ్యాయి. ఓ అరగంట గడిచి వుంటుంది. ఎవరో లైటుతీసేసినట్టు కరెంటు పోయింది. 'అరె! వుండండి అగ్గిపుల్లవెలిగిస్తాను' అని అగ్గిపుల్ల వెలిగించాడు. అదెంతసేపుంటుంది? నాకైతే చాలా ఇరకాటంగా అనిపించింది. కేకవేసి బంట్రోతును పిలుద్దామా అనుకున్నాను. ఇంత రాత్రి వేళ ఇలాంటి సన్నివేశంలో ఏ ముఖం పెట్టుకొని పిలుస్తాను అని భయమేసింది. అలా ఏదో ఆలోచిస్తు న్నాను. తలుపు మెల్లగా గడ పెట్టిన చప్పుడు వినిపించింది. దీపం స్విచ్ ఆఫ్ చేసిన చప్పుడూ వినపడింది. అంతలో అతను నా దగ్గరకు రావడమేమిటి? నా నోటిని


PLEASE VISIT:

Phone: 21493



# శ్రీ త్రినాధ్ క్లాత్ స్టోర్స్

STCS

లేడీస్ & జంట్స్ క్లాత్ షోరూమ్

ప్రొ॥ శలా నాగకోటేశ్వరరావు

ఆర్.ఆర్. పేట, ఏలూరు-2

మా అనుబంధ సంస్థలు:

అనూరాధ టెక్స్‌టైల్స్, శ్రీ నాగేంద్ర కట్‌పీసెస్, శ్రీ దుర్గా శారీ మందిర్, రామచంద్రరావుపేట, ఏలూరు-2

హోల్ సేల్ రేట్లకే రిటైల్ అమ్మకము

తన నోటితో మూసివేయడమేమిటి? అన్నీ ఒక్క క్షణంలో జరిగిపోయాయి. అతనిలోంచి పశువు ఇవతలకు వచ్చేడు. నేను మంత్ర ముగ్ధురాలిలా! అలా పిచ్చిదానిలాగ షాక్ తగిలినట్టు వుండి పోయాను. నాకు ఏముక్తి ప్రసాదించి వెళ్లి లైయి వేశాడు. వెనక్కి తిరిగి నాకేసి చూసి 'విశ్రాంతి తీసుకోండి పొద్దున్న మాట్లాడు కుందాం' అని తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు. ముందు గమ్మున పరుగెత్తి తలుపు గెడపెట్టాను. నాకతని మీద వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. అతను చేసిందేమిటి? ఒక్కరాల అత్యాచారం! కాదా బామ్మా?' అంది వున్నట్టుండి రాధ.

'అవునే నా తల్లీ! పోనీలే! మిమ్మల్నెవరూ చూడ లేదు కదా? ఈ దుఃఖం పొందనట్టుల్లు వాళ్ళ బాధ కూడా పడవలసి వస్తుంది' అంది రాధమ్మ.

'లేదు. నా కళ్ళకైతే ఎవరూ కనిపించలేదు. పని వున్నట్లు గది అవతలకు వెళ్లి అతని రూముదాకా జాగ్రత్తగా కళ్లు నులుముకుంటూ దొంగతనంగా పరి శీలించి చూశాను. అదృష్టం బావుంది. ఎవరూ చూడ లేదు. గదిలోకెళ్లి పడుకున్నానే గాని నా దుఃఖాన్ని మాత్రం దిగమింగుకోలేక పోయాను. వాణ్ణి చంపేయా లన్నంత కోపం వచ్చింది. నన్నూ చంపుకోవాలని పించింది. అప్పుడు మళ్లీ ఆలోచించుకున్నాను. నేను చెయ్యాలని ఆ పని చేయలేదు. అసలు నా ప్రమేయం లేకుండా జరిగిపోయింది. మరి అతను అలాగే బాధ పడుతున్నాడా? పడడు! బాధపడతాడని కూడా అను కోను. అసలు ఇది అందరికీ తెలిస్తేనూ, ఎవరైనా తెలిపితేనూ, లేక నేను తెలియజేస్తేనూ తప్పు అవు తుంది. నాకు ఒక ముద్ర పడుతుంది. అతనికీ చెడ్డ పేరు వస్తుంది. బోలెడంత గోలా అవుతుంది. నా అంతటి ఉద్యోగస్తురాలు పోలీసు కంప్లైయింటు ఇస్తే కూడా చాలా బాగానే వుంటుంది. కాని- కాని - అతను మాత్రం పెద్ద ఉద్యోగస్తుడు కాదా? నాకంటే తెలివిగా ప్రవర్తించి కేసులోంచి ఇవతల పడడా? తప్పకుండా మళ్లీ అతనే గెలుస్తాడు. అయినా ఈ వెధవ గొడవ గురించి నేను ఒకటా? ఎన్ని విధాల చూసినా! ఎన్నిసార్లు

> **ఇది వరకు - ఇప్పుడు**
>
> **"ఉపాధ్యాయుడు లేక మూసేసే పాఠశాలలు మన రాష్ట్రంలో చాలా వున్నాయి!"**
>
> **"అదేమోగాని, ప్రస్తుతం విద్యార్థులు లేక మూసివేయవలసిన మునిసిపల్ స్కూళ్ళు మాత్రం చాలా వున్నాయి" మరో పరిశీలకుని సమాధానం!**
>
> **-ఇ.వి. రమణ**

ఆలోచించినా దీనిని మింగి, మౌనంగా దుఃఖ భారాన్ని సహించడంలోనే ఎంతో ఔచిత్యం కనిపించింది. ఆ రకమైన నిర్ణయానికి వచ్చేసరికి తెల్లవారింది. ఆవాళ బోలెడంత పని వుంది. అలాగే గదిలోనే పడుకొని మనసును సమాధాన పరచుకోవాలనిపించింది. ఆరోగ్యం బాగా లేదంటే చాలు, తననెవరూ నిర్బంధించరు. కాని ఒంటరిగా వుంటే ఇంకా బాధ అనుకొని లేచి మామూలు కార్యక్రమాలలో నిమగ్నమయ్యాను. ప్రతీ నిమిషం అతనితోనే పని వుంటుంది. అతని ముఖం చూడగలనా? అనిపించింది. అంతలో బంట్రోతు వచ్చి మా డైరెక్టరు తెల్లవారు ఝామునే అర్జంటు పని మీద ఎక్కడికో వెళ్ళినట్టు వార్తమోసుకొచ్చాడు. ఒక్కదాన్నే అన్ని పనులు పూర్తిచేసుకొని క్యాంపు నుంచి వచ్చేశాను. అలాగే, నా స్నేహితురాలింట్లో పార్టీకి కూడా ఎలా వెళ్లానో తెలీదు, వెళ్లి వచ్చాను. ఇంతవరకు ఆఫీసుకు వెళ్లలేదు నీకూ తెలుసుగా! అతని ముఖమూ చూడ లేదు. ఏమిటో ఎన్ని రకాల ఆలోచనలో? అతనిని వీధిలో పెట్టలేదు కదా అని మళ్లీ మళ్లీ అలాగ అత్యాచారం చేస్తాడేమోనని భయం. లేకపోతే అతనంటే నాకు ఇష్టమేమోనని అనుకుంటాడేమోనని భయం. ఏం పాలుపోవడం లేదు బామ్మా. సినిమాల్లోను, కథల్లోను

అంటారు చూడు... కుక్కలు ముట్టుకున్న కుం- కుల- , ఏమిటి మరోటి విరిగిన విస్తరి-లాంటి వన్నీ జ్ఞాపకం వస్తున్నాయి' అంటూ తలగడలో తల దూర్చుకుని పడుకుంది రాధ.

'వెర్రి తల్లీ! నీ చిన్న మనసుకి ఎంత బాధొచ్చిందే అమ్మా!' అంటూ రాధ తల నిమురుతూ కూర్చుంది రాధమ్మ. బట్టల చాటునే వుండి అంతా వినేసిన రాధాకృష్ణకి రాధ పరిస్థితి అర్థమైంది. అందులో రాధ తప్పేమిటోనని ఆలోచిస్తున్నాడు.

కొంచెం సేపు అలా మౌనంగా వుండిపోయారు బామ్మా, మనవరాలూను.

'అమ్మడూ' అంది రాధమ్మ.

'ఏమిటి బామ్మ' అంది రాధ తలెత్తి.

'ఇప్పుడు నీకొచ్చిన సమస్యే ఒకప్పుడు, నువ్వు పుట్టక ముందు, మీ నాన్న పుట్టక మునుపు నాకూ వచ్చిందే తల్లీ! కాని ఇలా నీలా బెంబేలు పడి నేనెక్కడా దాక్కోలేదు' అంది రాధమ్మ.

ఒక్క ఉదుటున లేచి కూర్చుంది రాధ. 'ఏమిటే? నీకూ వచ్చిందా? నిజమేనా? నన్ను మాయ చేద్దామనీ! లేకపోతే నేను బాధపడకుండా చూడడానికే అలా అంటు న్నావా? బామ్మా! నిన్ను, నిన్ను ఇంతటి పతివ్రతని పట్టుకుని అవమానించిన దౌర్భాగ్యుడెవడో చెప్పు బామ్మ త్వరగా' అంది రవంత ఉద్రేకంగా.

'తప్పు, అలా అనకు దౌర్భాగ్యుడంటూ- ఎవరను కుంటున్నావ్? ఆ రోజుల్లో మేం ఇంట్లోంచి అవతలకు వెళ్లే వాళ్లం కాదుగా? పరాయి వాడేం చేయగలడు? ఇంట్లో వాళ్లే చెయ్యాలి గాని' అంది బామ్మ రాధమ్మ.

'ఇంట్లో వాళ్ళే! నిన్నే! అమ్మయ్యో! మళ్లీ అతని ముఖం ఎలా చూశావ్?'


'మామూలుగానే'


'బామ్మ చాలా గొప్పదన్నమాట' అంది గారాంగా.

'కాదూ మరి' అంది రాధమ్మ ముద్దుగా.

'చెప్పు బామ్మా! ఆ కథ నేను తప్పకుండా వినాలి' అంటు రాధమ్మ చేతులు పట్టుకుంది.

'అవును. నువ్వు తప్పకుండా వినాల్సిందే. అప్పుడు



మంచి వేసవి కాలం. మా కడసారపు మరిది పెళ్లి. అంతా తరలి వెళ్లాం. పెళ్లయి పోయింది. ఆ రోజుల్లో ఊరేగింపు అని ఒక తంతు వుండేది. పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు పల్లకీలో ఊరేగుతుంటే పల్లకీకి ముందు మగవాళ్లు, పల్లకీకి పక్కనా, వెనకాలా ఆడవాళ్లూ పిల్లలు అంతా నడుస్తూ ఊరంతా తిరిగే వారులే. నేను అర్భకం మనిషినని మా తాతయ్య నన్ను ఊరేగింపుకి రావొద్దని చెప్పి, నన్ను జాగ్రత్తగా విడిదికి తీసుకువచ్చి దిగబెట్టి వెళ్ళిపోయారు. సామానుతో, పెట్టెలతోను, బట్టలతోను అంతా ఎలా వుండాలో అలా వుంచాలని. ఓ మూల పక్క పరచుకొని పడుకున్నాను. ఆ పక్క గదిలోనే మా మామగారు పడుకొని వున్నారు. ఆయనకు దగ్గు, ఆయాసం. పాపం, ఖంగు ఖంగుమని దగ్గు వినిపిస్తూనే వుంది. గడియకొకసారి నిద్ర పాడయిపోతూంది. ఉక్కపోస్తుంది. ఆ కాలంలో పంకాలు అంతగా లేవు కదా. విసురుకొని విసురుకొని చెయ్యి పడిపోతుంది. ఎవరూ లేరు కదా అని రవికె తీసేసి అలా చెంగు కప్పుకుని, కళ్ళు మూసుకొని పడుకున్నాను. అంతే! దబుక్కున నన్నేదో దెయ్యం పట్టుకున్నట్లనిపించింది. వెంటనే నా నోరు మూసుకుపోయింది. ఎవరో చేత్తో మూసేసేరు.

'అమ్మ రాధమ్మా! ఎన్నాళ్ళకి దొరికేవు? ఎన్నాళ్లకి?' అంటూ 'అరవకేం, అరిచేవంటే చంపేస్తాను. పీక పిసికి పారేస్తాను జాగ్రత్త! అరవకేం' అంటూ నన్ను కాస్తా... అంటూ ఆగింది రాధమ్మ.

'అమ్మయ్యో! ఎంత ఘోరం! ఎంత దౌర్జన్యం! బామ్మా ఆ తర్వాత?'

'ఇంక ఆ తర్వాత ఏం వుందే? తన పని అయిపోగానే నన్ను మళ్లీ మళ్లీ ముద్దులు పెట్టుకొని ఎవరితోనూ చెప్పకేం, మా తమ్ముడితో చెప్పేవ్ జాగ్రత్త! వెర్రిదానా! మళ్లీ చెబుతున్నాను జాగ్రత్త! అదిగో మా నాన్నగారు పిలుస్తున్నారు వెళ్ళు' అంటూ వెళ్ళిపోయారు. ఆ మనిషెవరో తెలుసా? మీ పెద్ద తాతగారు' అని రాధమ్మ ఆగింది, ఏవో జ్ఞాపకం వచ్చి.

'అమ్మయ్యో! నేను బాధ పడలేను. నేను దురంతం సహించలేను బామ్మా! తరతరాలుగా ఈ అన్యాయం జరుగుతూనే వుందా? అమ్మయ్యో! మగవాళ్ళనందరినీ చంపెయ్యాలి' అంది రాధ కోపంతో మండిపోతూ.

'వెర్రిదానా! ఎందుకే చంపుకోవడం? పాపం మగవాడు పశువైపోతూంటాడు. కోరికకి బానిసై పోతాడు. ఆ క్షణంలో ఆడది ఏమనుకుంటుందని గాని, ఎంతో బాధపడుతుందని గాని ఆలోచించలేడు. నీతి సూత్రాలను మరచిపోతాడు. జాలిపడి, క్షమించకపోతే మనమే నాశనమై పోతాం. మన బ్రతుకులు వీధిలో పెట్టుకోకుండా, వాళ్ళ బ్రతుకులు వీధుల్లో పెట్టకుండా మన కర్మం ఇంతేనని అనుకుని ఎదురైన దురదృష్టాన్ని రహస్యంగా భరించాలి. లేకపోతే ఇందాక నువ్వన్నావు చూడు 'నన్నే చంపుకోవాలనిపించింద'ని అది చేసేసి లోకాన్ని వదిలి పెట్టాలి. నాకెందుకో ప్రాణం తీసుకోవాలనిపించలేదు. గుట్టు చప్పుడు కాకుండా మింగేసేను' అని ఆగింది రాధమ్మ.

'అమ్మ బామ్మా! నువ్వు ఇంగ్లీషు చదువులు చదువుకోలేదు గాని, ఏ చదువు నీకు ఉపయోగిస్తుందో ఆ చదువైతే పూర్తిగా చదువుకున్నావు సుమా' అంది రాధ మెచ్చుకోలుగా.

'కాదూ మరి! ఆ నాడు నేను మీ తాతగారితో ఈ విషయం చెప్పివుంటే ఏమయ్యేదో తెలీదు. నాకూ చిన్న తనం. ఏమిటో సిగ్గనిపించింది. కొత్త సమస్యలేమొచ్చి పడతాయోననిపించింది. కాస్సేపు ఏడ్చి ఊరుకున్నాను. ఆయనకీ నాకూ మాత్రమే తెలుసీ విషయం. పాపం పుణ్యాత్ముడు చచ్చి స్వర్గాన వున్నాడు మీ తాతయ్య. నన్ను ఎప్పుడూ ఏ విషయంలోనూ బాధ పెట్ట లేదమ్మా' అంటూ కళ్ళు ఒత్తుకుంది రాధమ్మ.

రాధ మౌనంగా ఏదో ఆలోచిస్తూ వుండి పోయింది.

'అందేత, ఏమిటే? అలా మళ్లీ దిక్కు ముఖం పెట్టుక్కూర్చున్నావు. ఈ విషయంలో నువ్వేమి గాభరా పడకు. నీ జీవితాన్ని పాడు చేసుకోకు సుమా! ఏదైనా గొడవ చేసుకుంటే నీకే నష్టం. కమ్ముకుని తెలివి ఉపయోగించుకుంటే కాపురం నిలబడుతుంది. లే! లేచి ముఖం కడుక్కో! స్నానం చేసి పూజ చేసుకో! నీ మనసు శాంతించేక ఆఫీసుకు వెడుదువు గానిలే. ఆ దుర్మార్గుడితో కలిసి మెలిసి వుండకపోతే ఎలా కుదురుతుంది? ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలన్నా కొన్నాళ్ళు కావాలి. మీ పెద్ద తాతలాగే ఏదో చాపల్యం అలా గడ్డి తిని వుంటాడు. ఈ పాటికి సిగ్గుతో కుళ్ళిపోయి వుంటాడు. మీ తాతయ్య మాత్రం మళ్లీ జన్మలో నా ముఖం చూడగలిగేరా? నేను ఆయన పట్ల వైరం పెట్టుకోక పోయినా ఆయన పశ్చాత్తాపమే ఆయనకు పెద్ద శిక్షయి పోలేదు' అంది రాధమ్మ.

'వాళ్లంతా మంచి వాళ్లు కాబట్టి చేసిన తప్పుకి పశ్చాత్తాపపడ్డారు. ఈ కాలం వాళ్లు అలా వుంటారా? బామ్మా!'

'ఈ కాలం వాళ్లు మనుషులు కారా? వీళ్ళకి జ్ఞానం వుండదా? వాళ్లే ఇక. నీకింకా చిన్న తనం. ఏం తెలీదు. ఇక లేచి స్నానం చెయ్యి. ఎవరితోనైనా అనేవు గాని- ఏ స్నేహితురాలి చెవిలోనైనా ఊదేవుగాని జాగ్రత్త! నన్ను చూడు! ఇంత మంది మనవలు కూడా పుట్టేరు. నేనెప్పుడైనా కనీసం మీ పెద్ద తాతయ్య పట్ల కోపాన్ని చూపించడం అయినా నువ్వు చూశావా? విన్నావా? అలా నిండుగా వుండాలమ్మా! కష్టాలు పరీక్షలు మనుషులకు రాక మానుకి వస్తాయా? నిభాయించు కోవాలి'

రాధ ఇంకా ఏదో ఆలోచిస్తూనే వుంది.

'ఏముందే తల్లీ ఆలోచించడానికి? ఎంత ఆలోచించినా పరిష్కారం ఏముంది? ఇదేగా! లే!లే!' అంటూ మెల్లగా గద్దించింది.

'అవును నిజమేనే! అంది రాధ.

'దా! ఏదో కొంప మునిగిపోయినట్టు బాధ పడకు. బ్రతకడం నేర్చుకో. ఏకాంతగా, నువ్వేదో మైలపడిపోయినట్లనిపిస్తే రాధాకృష్ణకి విడాకులిచ్చేసి నీ అన్నం నువ్వు తిని వేరేగా బతుకు. అంతేకాని పిచ్చి ఆలోచనలతో ప్రాణం తీసుకోడానికి ప్రయత్నం చెయ్యకు. తెలిసిందా?' అంటూ మనవరాలి జబ్బ పట్టుకొని లేవదీసింది. రాధ యాంత్రికంగానే బామ్మ కూడా ఒక బొమ్మలా నడిచి వెళ్లింది. బామ్మ ఆసరా ఆమెకెంతో మనశ్శాంతిని ఇచ్చింది. వివేకాన్ని కలిగించింది.

బట్టల స్టాండు వెనకాల దొంగలా నక్కి అన్నీ విన్న రాధకృష్ణకి ఆవేశం ఆగ్రహం రాలేదు. వివేకం వచ్చింది. 'ఓస్ ఇంతేనా? ఇంకా ఏదో మునిగిపోయిందనుకున్నాను. రాధను విడిచిపెట్టి ఒక్క క్షణం బ్రతకలేను ఇంక విడాకులెలా ఇస్తాను?' అనుకుంటూ నెమ్మదిగా ఆ గదిలోంచి బైటపడ్డాడు.

---

## *
## కన్నీటి "మేగజైన్"

పసి కలాలకు మొలిచిన మీసాలు
నాలుకలను రోమకూపాలు చేస్తున్నాయి
గొంతులోనే మురిగిపోతున్న
అక్షర బీజం
సిద్ధాంతాల విద్యుత్కవచాన్ని నిర్మించుకొంటున్నది
మసక కిరణాల మట్టి జ్యోతులు
నీడల ప్రమథ గణాన్ని లెక్కించుకొంటోంది
సందేహాల స్మశానాలు
ప్రశ్నల తూటాల తోటలుగా
భ్రమింపచేస్తున్నాయి.
ఆత్మలను తాకట్టుపెట్టే
అన్ని పత్రికల చౌరాస్తాల్లో అదే కొయ్య తుపాకీ-
ప్రతిబింబాలకు పహారా కాస్తుంది
అటుగా వెళ్ళే వారందరికీ
అదే ముద్ర వేస్తుంది
మాట తర్కానికి గురయి
మాట నిర్జీవ నిర్వచనాల ప్రోగయి
మాట ఇంద్రవెల్లినుంచి ఇరాక్ దాకా సాగి
కొస మెరుపు అఖండ ఆశయానికి
అతికింపబడుతుంది
'అసంబద్ధ' చీకటి శిఖరాల మీద
రాలుతున్న కన్నీటి బిందువులతో
'మేగజైన్' నింపబడుతుంది.

* 'పిస్టల్'లో తూటాలు నింపే స్థలం

—పెన్నా శిరాక్స